నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

3 | ఖమ్మం, సోమవారం 4 మార్చి 2024 | BHADRADRI KOTHAGUDEM


# రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు పెద్దపీట


## డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

ఎర్రుపాలెం, మార్చి 3: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు పెద్దపీట వేశామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం భవానీపురం– కాచవరం వరకు రూ.16 కోట్ల నిర్మించనున్న బీటీ రోడ్డు, భీమవరం –గోసవీడు వరకు రూ.15 కోట్లతో రోడ్డు, బ్రిడ్జి, అయ్యావారిగూడెం –బుచ్చిరెడ్డిపాలెం వరకు రక్షణగిరి రోడ్డుకు రూ.6.5 కోట్ల వ్యయంతో బీటీరోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. తమ ప్రభుత్వం వందకు వందశాతం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల లోపునే 25 వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేశామన్నారు. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలన్నింటినీ ఒకే చోట నిర్మిస్తామన్నారు. అందరికీ కామన్ ప్లే గ్రౌండ్స్, ల్యాబ్స్ అందుబాటులో ఉంటాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ దేవరకొండ శిరీష, జడ్పీటీసీ శీలం కవిత, నాయకులు సుధాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, యరమల పూర్ణచంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నరసింహారావు, గోవర్ధన్‌రెడ్డి, నాగిరెడ్డి, గంటా తిరుపతమ్మ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

# సీఎంను కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం



సీఎం రేవంత్‌రెడ్డికి వినతి అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం

భద్రాచలం, మార్చి 3: హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కుటుంబ సమేతంగా కలిశారు. భద్రాచలంలోని రామాలయ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని, కరకట్ట పనులను వేగవంతంగా చేపట్టాలని, ములుగు జిల్లా వెంకటాపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని, భద్రాచలం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై సీఎంకు వినతిపత్రం అందజేశారు. సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

# బీజేపీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) అగ్రనేత ప్రదీప్‌సింగ్ ఠాగూర్

- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ అగ్రనేత ప్రదీప్‌సింగ్ ఠాగూర్
- ఖమ్మం నగరంలో మూడు విప్లవ పార్టీల ఐక్యత బహిరంగ సభ



ఖమ్మం నగరంలో విప్లవ పార్టీ నాయకుల కవాతు

ఖమ్మం, మార్చి 3 : పదేళ్ల బీజేపీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యమయ్యాయని, పాలనలో నియంతృత్వం వచ్చేసిందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ అగ్రనేత ప్రదీప్‌సింగ్ ఠాగూర్ అన్నారు. సీపీఐ (ఎం.ఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ (ఎం.ఎల్), సీపీఐ (ఎం.ఎల్) ఆర్.ఐ పార్టీలన్నీ కలిసి సీపీఐ (ఎం.ఎల్) మాస్‌లైన్‌గా ఏర్పడిన సందర్భంగా ఆదివారం ఖమ్మం నగరంలోని పెవిలియన్ మైదానంలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. విప్లవ పార్టీలు చేసిన తప్పిదాలను ఇప్పటికే గుర్తించాయని, ఆ తప్పిదాలను సరిచేసుకునేందుకే ఒక్కటయ్యాయన్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలపై మున్ముందు బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామన్నారు. వామపక్ష పార్టీల్లో చీలికల కారణంగా ఉద్యమాలు బలహీనమయ్యాయన్నారు. నేడు వామపక్షవాదులందరూ ఒక్కటై ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ పాలనపై గొంతెత్తిన వారిపై రాజ్యాంగ వ్యవస్థలను ప్రయోగించడం దుర్మార్గమన్నారు. కేంద్రంలో బీజేపీకి ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇండియా కూటమి సిద్ధమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. దేశంలో విప్లవ పార్టీల ఐక్యత జరగాలని, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ఫాసిస్టు విధానాలపై మరిన్ని పోరాటాలు రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. బహిరంగ సభల నిర్వహణ కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ హిట్లర్ వారసుడని, ఆయన సెక్యులర్ శక్తులను అణచివేస్తున్నారని మండిపడ్డారు. మణిపూర్‌లో మహిళలపై దాడులు జరుగుతుంటే ప్రధాని మోదీ నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. ఢిల్లీలో మద్దతు ధర కోసం రైతులు పోరాడుతుంటే వారికి భరోసాగా మోదీ ఒక్క హామీ ఇవ్వలేకపోతున్నారన్నారు. కార్యక్రమాల్లో నాయకులు సుభాల్ దేవ్, సంజయ్ సింఘ్వీ, ధినిష్ గోహైన్, కెజీ రాంచందర్, కె.రమ, ఆర్.చంద్రశేఖర్, గుమ్మడి నర్సయ్య, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, పూజారి, జీవన్‌కుమార్, రవిబాబు, నెట్కార్, త్రివేది పాల్గొన్నారు.

### నగరంలో భారీ ప్రదర్శన..

బహిరంగ సభకు ముందు నాయకులు ఖమ్మం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పటేల్ మైదానం నుంచి వేలాది మంది కార్యకర్తలు, నాయకులు పెవిలియన్ గ్రౌండ్‌కు ప్రదర్శనగా వచ్చారు. కళాకారుల నృత్యాలు, డప్పు చప్పుళ్లు, ఎర్ర జెండాలతో నగరం ఎరుపెక్కింది. ప్రధాని మోదీ, కార్పొరేట్ శక్తుల విధానాలకు సంబంధించిన నృత్యరూపకాలు నగరవాసులను ఆకట్టుకున్నాయి.

# ఆ రెండు హామీలు.. అందని ద్రాక్షలేనా?

- ‘గ్యాస్’, ‘విద్యుత్’ హామీలు కొందరికే వర్తిస్తాయా?
- రేషన్ కార్డులు లేని దరఖాస్తుదారుల పరిస్థితి ఏమిటో?
- మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటూ మంత్రుల ఉచిత సలహాలు
- మరి అప్పటిదాకా ఆయా హామీలకు మంగళం పాడినట్లేనా?
- కొత్త కార్డులు ఇవ్వకుండానే పథకాలకు అదే అర్హతంటూ నిబంధన
- ఫలితంగా గ్యారెంటీ హామీలకు అర్హత కోల్పోతున్న నిరుపేదలు
- మొదలైన విద్యుత్ బిల్లుల రీడింగ్.. లబ్ధిదారుల్లో ఆందోళన లోడింగ్..
- ‘రూ.500 గ్యాస్’లోనూ అదే రూల్.. చెల్లింపులన్నీ తర్వాత రీఫండ్



ప్రజాపాలనలో తెల్లరేషన్ కార్డు కోసం దరఖాస్తులు తీసుకున్న అధికారులు (ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 3 (నమస్తే తెలంగాణ): కొత్త ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశ పెట్టిన మరో రెండు గ్యారెంటీ హామీలు అర్హులకు అందని ద్రాక్షగానే మిగిలిపోయేలా ఉన్నాయి. 200 యూనిట్లలోపు గృహ విద్యుత్‌ను వినియోగించుకున్న పేదలకు జీరో బిల్ చేస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తామని చెప్పిన ప్రభుత్వం.. రేషన్‌కార్డులు ఉన్న వారే ఈ రెండింటికీ అర్హులని మెలికపెట్టింది. దీంతో రేషన్‌కార్డులు లేనివారంతా ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఈ పథకాలు మొదలుకావడంతో వారంతా లబోదిబోమంటున్నారు.

### రేషన్ కార్డులు ఇవ్వం.. కానీ అదే ప్రామాణికం..

ప్రజాపాలన పేరుతో ఊరూరా ఆర్భాటంగా గ్రామసభలు పెట్టిన ప్రభుత్వం.. ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తులు స్వీకరించింది. పథకాలన్నింటికీ రేషన్‌కార్డునే ప్రామాణికంగా పేర్కొంది. కానీ రేషన్‌కార్డులు లేని వారూ కూడా సభలకు పోటెత్తడంతో అసలు ఫార్మాట్‌లో కాకుండా తెల్లకాగితాలపై రేషన్‌కార్డుల దరఖాస్తులు స్వీకరించింది. కానీ వాటిని జారీ చేయలేదు. కానీ ఎక్కువమంది పేదలు లబ్ధిపొందే 200 యూనిట్ల కరెంటు, రూ.500 గ్యాస్ వంటి పథకాలను ఇటీవలే ఆర్భాటంగా ప్రారంభించింది. అయితే రేషన్‌కార్డులు లేనివారంతా ఇప్పుడు ఈ పథకాలకు అర్హతను కోల్పోతున్నారు.

### మంత్రుల ఉచిత సలహాలు

ఉమ్మడి జిల్లాలో ఇటీవల జరిగిన అధికారిక కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రులు ఉచిత సలహాలు విసిరేశారు. పథకాల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు అందించని వారంతా ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో మళ్లీ దరఖాస్తులు అందజేయాలని సలహాలు ఇచ్చారు. కానీ కొత్త రేషన్ కార్డుల జారీపై మాత్రం స్పష్టమైన ప్రకటనలేమీ చేయలేదు. కానీ పథకాలను అసలు మూలమైన రేషన్ కార్డులు లేకుండా దరఖాస్తులు ఎలా చేసుకోవాలని, పథకాలకు ఎలా అర్హత సాధించాలని కార్డులేని నిరుపేదలు ప్రశ్నిస్తున్నారు. రేషన్ కార్డులు లేని తమ పరిస్థితి ఏమిటోనంటూ దిగులుపడుతున్నారు. రేషనస్‌కార్డుల్లేని తమకు ఆ హామీలను అమలుచేయకుండా మంగళం పాడినట్లేనా? అని ప్రశ్నిస్తున్నారు.

### మొదలైన విద్యుత్ బిల్లుల రీడింగ్..

ఇటీవల ప్రకటించిన మరో రెండు హామీల్లో భాగంగా 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌ను అధికారులు మొదలుపెట్టారు. శనివారం నుంచి భద్రాద్రి జిల్లాలో విద్యుత్ సిబ్బంది దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి కరెంటు బిల్లుల రీడింగ్‌ను నమోదు చేస్తారు. రేషన్ కార్డు ఉన్న అర్హులకు జీరో బిల్లును అందజేస్తారు. కానీ రేషన్ కార్డులు లేని పేదలు మాత్రం పూర్తి బిల్లును చెల్లించాల్సి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా 2,82,439 గృహ వినియోగ విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. 2,93,300 రేషన్ కార్డులు ఉన్నాయి. కొత్త రేషన్ కార్డుల కోసం మరో 20 వేల మందికి వరకూ దరఖాస్తు చేసుకొని ఉన్నట్లు సమాచారం. కొత్తగా వివాహమైన వారు వేరు కాపురం పెట్టడం, చిన్న కుటుంబాలుగా ఏర్పడి అద్దెలకు ఉండడం వంటి కారణాలతో రేషన్‌కార్డుల దరఖాస్తులు ఎక్కువయ్యాయి. కానీ వీరికి రేషన్ కార్డులు లేకపోవడంతో వీరంతా ఆయా పథకాల ద్వారా లబ్ధిపొందలేకపోతున్నారు. అదే విధంగా జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు 3.90 లక్షలు ఉన్నాయి. ఈ మేరకు రేషన్‌కార్డులు కూడా ఉండాలి. కానీ సుమారు లక్ష కార్డుల వరకూ తక్కువగా ఉన్నాయి. కేవలం రేషన్ కార్డుల్లేని కారణంగా ఈ పథకంలోనూ అధికమంది ప్రజలు లబ్ధిపొందలేకపోతున్నారు. అయితే రూ.500కే గ్యాస్ పథకంలోనూ ప్రభుత్వం అనేక మెలికలు పెట్టింది. మూడేళ్ల సగటు వినియోగాన్ని బట్టే రూ.500 సబ్సిడీ అందిస్తామని చెబుతోంది. అదీగా ఈ పథకాన్ని వినియోగించుకోవాలంటే తొలుత లబ్ధిదారులు సదరు గ్యాస్ ఏజెన్సీకి మొత్తం నగదును చెల్లించాలి. ఆ తరువాత రూ.500ను ప్రభుత్వం లబ్ధిదారులకు రిఫండ్ చేయనుంది.

### 200 యూనిట్లలోపు వినియోగిస్తేనే జీరో బిల్లు..



గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించుకుంటున్న పేదలకు జీరో బిల్లులను జారీ చేస్తున్నాం. మా సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి మీటర్లలో యూనిట్లను నమోదు చేస్తున్నారు. నిర్ణీత యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించిన లబ్ధిదారులకు అక్కడికక్కడే జీరో బిల్లును తీసి ఇస్తున్నాం. ఈ ప్రక్రియ పూర్తయితే అసలైన అర్హులు ఎంతమంది ఉన్నారో తేలిపోతుంది. మాకు వచ్చిన ప్రజాపాలన జాబితా ఆధారంగా దరఖాస్తుల ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తున్నాం. రేషన్‌కార్డులు ఉండి 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించిన వారినే అర్హులుగా నిర్ధారిస్తున్నాం. నిర్ణీత యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్‌ను వినియోగించిన వారు మొత్తం బిల్లును చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకోవడం అనేది నిరంతర ప్రక్రియ. అర్హులెవరైనా ఉండి సరైన ధ్రువపత్రాలతో మళ్లీ దరఖాస్తు చేసుకుంటే వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటాం.

**–రమేశ్, విద్యుత్ శాఖ ఎస్ఈ, కొత్తగూడెం**

### రేషన్ కార్డు లేదని పథకాలు వర్తించవంటున్నారు..



కూలి పనులు చేసుకునే జీవించే మాకు రేషన్ కార్డు లేదు. దీని కోసం ప్రజాపాలనలో దరఖాస్తు పెట్టుకునేందుకు వెళ్లాం. అయితే ప్రజాపాలన సభలు ఆరు గ్యారెంటీ పథకాల కోసమని, రేషన్ కార్డుల జారీకి కాదని అక్కడి అధికారులు చెప్పారు. మీసేవా కేంద్రానికి వెళ్లి రేషన్ కార్డు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తీరా అక్కడికి వెళ్తే రేషన్‌కార్డు కోసం ఆన్‌లైన్‌లో అప్లై చేసే అవకాశం లేదన్నారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం కొన్ని పథకాలను మొదలు పెడుతోంది. ఇప్పుడు మొదలుపెట్టిన కరెంటు, గ్యాస్ పథకాలను రేషన్ కార్డు కచ్చితంగా కావాలంటున్నారు. కానీ మా దగ్గర అది లేదు. దీంతో ఆ పథకాలు మాకు వర్తించవని చెబుతున్నారు. ఏం చేయాలో తోచట్లేదు.

**–ధరావత్ శ్రీదివ్య, తిప్పనపల్లి, చంద్రుగొండ మండలం**

### కార్డు లేనందున ఫ్రీ కరెంటు కుదరదంట..



ప్రజాపాలన దరఖాస్తు పట్టుకొని ఆ మధ్య కరెంటోళ్లు మా ఇంటికి వచ్చారు. వివరాలన్నీ రాసుకున్నాక రేషన్ కార్డు అడిగారు. మాకు రేషన్ కార్డు లేదని, దాని కోసం ప్రజాపాలన సభలో దరఖాస్తు పెట్టుకున్నామని చెప్పాము. అయితే రేషన్‌కార్డు లేనందున 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ మాకు రాదని అధికారులు తేల్చి చెప్పారు. ఇంకోవైపు రూ.500 గ్యాస్‌కు కూడా రేషన్ కార్డే కావాలంట. దీంతో అది కూడా మాకు వచ్చే అవకాశం లేదు. అసలు మాకు కొత్త రేషన్ కార్డు ఎప్పుడిస్తారో చెప్పలేదు. కానీ కార్డు లేని కారణంగా ఇప్పుడు అమలుచేస్తున్న ఈ పథకాలు మాకు అందకుండాపోతున్నాయి. పథకాలు రాని వాళ్లు మళ్లీ దరఖాస్తు పెట్టుకోవాలని మంత్రులు చెబుతున్నారు. కానీ కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడిస్తారో అనే విషయం చెప్పడం లేదు.

**–సంగ కార్తీక్, టేకులపల్లి మండలం**

# సాగునీరు లేక రైతన్న కన్నీరు

- వాగులు, బోర్లు ఎండిపోయి ఎండిపోతున్న పంటలు
- లక్ష్మీదేవిపల్లి మండలంలో తీవ్ర నీటిఎద్దడి
- సింగరేణి కోయగూడెం ఓసీ నుంచి నీరు విడుదల చేయాలని రైతాంగం విజ్ఞప్తి



సాగునీరు అందక ఎండిపోతున్న వరి పొలాలు

లక్ష్మీదేవిపల్లి, మార్చి 3: నలుగురి ఆకలి తీర్చే రైతన్న ఇప్పుడు దిగాలు పడ్డాడు. సాగునీరు అందక, పంటలను కాపాడుకోలేక విలవిలలాడుతున్నాడు. వేసవి ఆరంభం కాక ముందే వాగులు, బావులు, బోర్లు ఎండిపోవడంతోనే ఈ పరిస్థితి. లక్ష్మీదేవి మండలంలో ఇలా సుమారు 250 ఎకరాల్లో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయాయి. సీతారాంపురం, బాలుతండా, పులిగుండం, గడ్డిగుట్ట, బట్టు తండా, కారుకొండ రామవరం గ్రామాల్లో తీవ్రత ఎక్కువగా కనిపిస్తున్నది. వాగుల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండడం, వర్షాభావ పరిస్థితులు, బోర్లు, వాగులు, చెరువుల్లో నీరు లేకపోవడంతోనే పంటలు ఎండిపోయాయని రైతులు వెల్లడిస్తున్నారు.

### ఓసీ నుంచి జలాలు మళ్లించాలనివేడు కోలు..

వేసవి ప్రారంభం కాక ముందే లక్ష్మీదేవిపల్లి మండలంలోని పెద్దవాగు, చినవాగులు, చెరువులు ఎండిపోయాయి. గతంలో ఇలాంటి పరిస్థితి వస్తే అధికారులు సింగరేణి కోయగూడెం ఓసీ నుంచి వాగుల్లోకి నీటిని వదులుతుంటారు. ఈసారి కూడా ప్రభుత్వం చొరవ తీసుకుని నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నీటిఎద్దడి నివారణకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టేవారు. ఇప్పుడా స్పందన లేదు.



వాగులో చెలిమ తీసి ఏర్పాటు చేసిన పైపులు



నీళ్లు లేక ఎండిపోతున్న వాగులు

### కోయగూడెం ఓసీ నుంచి నీటిని మళ్లించాలి..



ఏటా పుష్కలంగా నీరు అందేది. కానీ ఈసారి వేసవి మొదలు కాకముందే పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది. అధికారులు ప్రత్యేక చొరవ చూపి సింగరేణి కోయగూడెం ఓసీ నుంచి నీటిని మళ్లిస్తే మా పంటలు చేతికొస్తాయి. పెట్టిన పెట్టుబడులైనా చేతికొస్తాయి. సాగునీరు అందించే విషయంలో ప్రభుత్వం చొరవ చూపాలి.

**– మాలోత్ ధర్మా, రైతు, సీతారాంపురం, లక్ష్మీదేవిపల్లి మండలం**

### పంటలు ఎండిపోతున్నాయి..



నీళ్లు పుష్కలంగా ఉన్నాయని మేం పంటలు వేశాం. సాగు ప్రారంభించి నెలా పదిహేను రోజులు దాటింది. సాగునీరు లేక పంట ఇప్పుడు ఎండిపోయే స్థితిలో ఉంది. వాగులు, చెరువులు, బావుల్లో జలాలు ఇంకిపోవడంతోనే ఈ పరిస్థితి. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రభుత్వం పంటలకు సాగునీరు అందించాలి.

**– వాంకుడోత్ లాలు, రైతు, లాలుతండా, లక్ష్మీదేవిపల్లి మండలం**

# పోలియో రహిత సమాజం కోసం..

ఉమ్మడి జిల్లాలో పల్స్‌పోలియో విజయవంతం



ఖమ్మంలో తన కూతురికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్



తన పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక ఆల



సత్తుపల్లి టౌన్ : పల్స్‌పోలియోలో భాగంగా చిన్నారికి చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

పల్స్‌పోలియో సందర్భంగా ఆదివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు హాజరయ్యారు. ఖమ్మంలో కలెక్టర్ వీపీ గౌతమ్, వైరాలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సత్తుపల్లిలో మట్టా రాగమయి, కొత్తగూడెంలో కలెక్టర్ ప్రియాంక ఆల, డీఎంహెచ్‌వో శిరీష, మున్సిపల్ చైర్‌పర్సన్ సీతాలక్ష్మి, పాల్వంచలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మణుగూరులో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేటలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, టేకులపల్లిలో ఎమ్మెల్యే కోరం కనకయ్య వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

–నమస్తే నెట్‌వర్క్‌మార్చి 3



అశ్వారావుపేట : పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే



టేకులపలి: పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య



మణుగూరుటౌన్ : చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



వైరాటౌన్ : పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



పాల్వంచ: ప్రోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని



పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్